సాక్షి చిత్తూరు

శనివారం । 21 । అక్టోబర్ । 2023



అమరవీరులకు వందనం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం చిత్తూరు, తిరుపతిలో ప్రత్యేక పరేడ్ నిర్వహించనున్నారు. - IIలో



అథ్లెటిక్స్‌లో నింద్ర విద్యార్థుల సత్తా

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన ఇద్దరు విద్యార్థులను ఏపీ క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా అభినందించారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	22
తిరుపతి	34	23
తిరుమల	29	19
గూడూరు	35	26
నగరి	33	22

న్యూస్‌రీల్

'జగనన్నకు చెబుదాం' సమస్యలకు సత్వర పరిష్కారం



సదుంలో వినతులు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు

సదుం: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ, ప్రజా సేవ చేయడం అదృష్టంగా భావించి అధికారులు పని చేయాలన్నారు. వచ్చిన అర్జీలను 15 రోజుల్లోగా పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యలు పరిష్కరించే అవకాశం లేకపోతే అందుకు గల కారణాలను అర్జీదారునికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ శివయ్య, జెడ్పీసీఈఓ ప్రభాకర్ రెడ్డితోపాటు మండల అధికారులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా బోయకొండ గంగమ్మ



సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: ప్రముఖ పుణ్య క్షేత్రమైన బోయ కొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని పుష్పాలు, ఆభరణాలతో వీణాపాణిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం ఉభయదారులకు పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారు శనివారం దుర్గాదేవి అలంకరణలో దర్శన భాగ్యం కల్పించనున్నట్లు ఈఓ చంద్రమౌళి పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలహీనమైన, వెనుకబడిన వర్గాల అభ్యర్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' అనే నూతన పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థులకు నగదు ప్రోత్సాహం అందిస్తారన్నారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత పొందిన వారికి రూ. లక్ష, మెయిన్స్ పరీక్షల్లో అర్హత పొందిన వారికి రూ.50 వేలు నగదు ప్రోత్సాహం అందిస్తారని చెప్పారు. మే 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.1 లక్ష అందించేందుకు ప్రస్తుతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకానికి జిల్లాలో అర్హులైన అభ్యర్థులు ఉన్నట్లయితే www.jnanabhumi.ap.gov.in లో నవంబర్ 4వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని డీడీ కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగుల స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారం ఉద్యోగుల స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల స్పందనలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. విధానపరమైన అంశాల ఫిర్యాదులను ప్రభుత్వానికి పంపుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాజశేఖర్, ఏవో కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హనుమంత వాహనంపై శ్రీవేంకటేశ్వరుడు



పుష్పక విమానం



గజ వాహనంపై గోవిందుడు





వైభవోత్సవం..!

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సంబరంగా సాగుతున్నాయి. సప్తగిరులు భక్తసిరులతో నిండిపోతున్నాయి. తిరుమాడ వీధులు గోవిందనామస్మరణతో మార్మోగుతున్నాయి. సాంస్కృతిక సరాగాలు అంబరాన్ని తాకుతున్నాయి. విద్యుద్దీప కాంతులు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. విరబూసిన అందాలు భక్తులను రా..రమ్మని ఆహ్వానిస్తున్నాయి. దేవదేవుని దివ్య స్పర్శతో పునీతమవుతున్నాయి.

- మూడు వాహనాల్లో మురిపించిన ముగ్ధ మనోహరుడు
- ఉదయం హనుమంత, సాయంత్రం పుష్పక విమానం, రాత్రి గజ వాహనంపై ఊరేగిన శ్రీవారు
- తిరుమల కొండపై బ్రహ్మోత్సవ శోభ

తిరుమల: తిరుమలలో శుక్రవారం బ్రహ్మోత్సవ శోభ ఉట్టిపడింది. మలయప్ప మూడు వాహనాలపై ఊరేగుతూ భక్తులను మురిపించారు. ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం పుష్పక విమానం, రాత్రి గజవాహనంపై ఊరేగుతూ భక్తకోటిని అనుగ్రహించారు. దేవదేవుని దివ్యమంగళరూపాన్ని దర్శించి భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగితేలారు. కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి వాహన సేవలు

ఉదయం సూర్యప్రభ వాహనం: బ్రహ్మోత్సవాల్లో ఏడోరోజు శనివారం ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు ఊరేగుతూ కనువిందు చేయనున్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వాహన సేవ నిర్వహిస్తారు.

రాత్రి చంద్రప్రభ వాహనం: రాత్రి తెల్లటి వస్త్రాలు, పుష్ప మాలలు ధరించి చల్లని వాతావరణంలో తిరువీధుల్లో స్వామివారు చంద్ర ప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు తిరువీధుల్లో స్వామివారు ఊరేగనున్నారు.



జయజయరాం.. సీతారాం!



హనుమంత వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి



అమ్మా..పాహిమాం!



భక్తజన కాంతార!

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఖర్చులు తగ్గించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. మామిడి పంటను సేంద్రియ విధానంలో సాగు చేసేందుకు పలువురు సలహాలు కోరినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో అవగాహన సదస్సుల నిర్వహణకు చర్యలు చేపడతామన్నారు. కిసాన్ క్రెడిట్ గ్రూపుల ద్వారా డ్రోన్ పరికరాలను ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. రానున్న కాలంలో బీమా సౌకర్యం కల్పిస్తారని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్ వివరించారు. పట్టుపురుగుల పెంపకానికి సంబంధించిన షెడ్లను నిర్మించుకునేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో సబ్సిడీ అందజేస్తున్నట్లు పట్టుపరిశ్రమల శాఖ జేడీ శోభారాణి తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు పథకాల లబ్ధి పొందేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, లోటుపాట్లు తదితర అంశాలపై సభ్యుల సలహాలు స్వీకరించి పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో ఈఈ శ్రీహరి, సభ్యులు గోవర్ధన్‌బాబీ, రత్నారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కుమార్, అధ్యాపకులు

పుత్తూరు రూరల్: ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అందించే ప్రగతి, సాక్ష్యం, స్వానాథ్ ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.కుమార్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఉపకార వేతనాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు జాతీయ స్థాయిలో 10 వేల మంది విద్యార్థినులకు ప్రగతి పేరిట ఒక్కో విద్యార్థినికి రూ.50 వేల ఉపకారవేతం అందించనున్నారు. ఇందుకు డిప్లొమా పాలిటెక్నిక్ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థినులు అర్హులు. తొలి ఏడాది దరఖాస్తు చేసుకొన్న వారికి ద్వితీయ, తృతీయ ఏడాదిలో మెరిట్‌ను బట్టి ఉపకార వేతనాన్ని రెన్యూవల్ చేస్తారు. పాలిటెక్నిక్ పూర్తి చేసుకొని బీటెక్ రెండవ ఏడాది లేటరల్ ఎంట్రీలో సీట్లు పొందిన విద్యార్థినులు సైతం ప్రగతి స్కాలర్‌షిప్‌కు అర్హులు. సాక్ష్యం పేరిట దివ్యాంగులైన విద్యార్థులకు రూ.50 వేలు చొప్పున ఉపకార వేతనం అందిస్తున్నారు. కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయినా, ఇద్దరిలో ఒకరిని కోల్పోయి అనాథలైన విద్యార్థులకు ఆర్మీ పేరిట, పారా మిలటరీలో పనిచేస్తూ ప్రాణత్యాగం చేసిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు స్వానాథ్ పేరిట ఉపకారవేతనాలను రూ.50 వేలు చొప్పున అందిస్తారు. ఈ కేటగిరీలకు చెందిన విద్యార్థులు డిసెంబర్ 31వ తేదీ లోపు సంబంధిత పత్రాలతో కళాశాలలోని సివిల్ విభాగం అధ్యాపకులు వెంకటేష్‌ను సంప్రదించాలి. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో అధ్యాపకులు సుగుణ, సృజన, రామకృష్ణ, వేలాయుధాచారి, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ సీఎం అయ్యాకే అభివృద్ధి ఆరంభం





బోయకొండ బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆలయం వద్ద ఆశీర్వాద మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

- రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- బోయకొండ గంగమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ
- రూ.4 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభం

చౌడేపల్లె: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాతనే రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ అభివృద్ధి మొదలైందని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం కుటుంబ సమేతంగా హాజరై బోయకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం గంగాపురంలో నూతన పాలక మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన బహిరంగ సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటినుంచి బోయకొండ క్షేత్రాన్ని దశలవారీగా ఊహించని రీతిలో అభివృద్ధి చేశామని తెలిపారు. తాను ప్రతిపక్షంలోని శాసన సభ్యుడిగా ఉన్నప్పుడు పుంగనూరు నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయాలని అనుకున్నానో అవన్నీ ఇప్పుడు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతం తాగునీటి, సాగునీటికి దుర్భిక్షంగా మారిందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించి పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవుల పల్లె, తంబళ్లపల్లె మండలం ముదివేడు రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అయితే ఈ ప్రాజెక్టులు పూర్తయితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, చంద్రబాబు కోర్టులకు వెళ్లి అడ్డుకట్ట వేశారని వివరించారు. అయినప్పటికీ రిజర్వాయర్ల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ నాలుగేళ్లలో పుంగనూరులో ఆర్టీసీ డిపో, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, అత్యంత సుందరంగా రోడ్లు, బైపాస్ రోడ్లు, పట్టణంలో డబుల్‌రోడ్డు నిర్మించామన్నారు. ఇంత అభివృద్ధి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనమందరం కలిసి మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు, చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని కొనియాడారు. మేనిఫెస్టోలో చంద్రబాబు హామీల వర్షం కురిపించి, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను మట్టిలో కలిపేస్తారని విమర్శించారు. అదే జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తిచేశారని గుర్తుచేశారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన సతీమణి స్వర్ణలత, శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి సంప్రదాయ బద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి మంత్రి పెద్దిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారికి నూతన ఆశీర్వాద మండపంలో జ్ఞాపికతోపాటు పవిత్ర తీర్థ ప్రసాదాలను చైర్మన్, ఈవో కలిసి అందజేశారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు.



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి పెద్దిరెడ్డి దంపతులు

బోయకొండలో అభివృద్ధి పనులు ప్రారంభం

పుణ్యక్షేత్రమైన బోయకొండలో రూ.4 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను మంత్రి పెద్దిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం రూ.32 లక్షలతో నిర్మించిన పెద్ద భోగ మండపం, రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన ఆశీర్వాద మండపం, రూ.25 లక్షలతో నిర్మించిన సెక్యూరిటీ, 130 సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను, ఔట్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. రూ.75 లక్షలతో అదనపు పార్కింగ్ ప్రాంగణం, రూ.54 లక్షలతో నిర్మించిన 9 స్వాగత తోరణాలను, రూ.50 లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. భవానీ నగర్ వద్ద రూ.17 లక్షలతో నిర్మించనున్న ముఖ ద్వార నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పొదలపల్లె వద్ద ఆదర్శ రైతు డాక్టర్ మోహన్‌రెడ్డి హార్టికల్చర్ ద్వారా నిర్మించిన ఏసీ ప్యాక్ హౌస్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరూ బడిలో ఉండాలి

వెదురుకుప్పం: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే కొనసాగాలని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. డ్రాపౌట్స్ వివరాలను సేకరించారు. బడిఈడు పిల్లలు బయట పనుల్లో ఉండకూడదన్నారు. పాఠశాలకు వెళుతూ మధ్యలో మానేసిన వారిని గుర్తించి, వారిని చదువుల్లో కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అక్షరాస్యత సాధన దిశగా అనేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎంఈఓ దామోదరం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

టీటీడీకి పది టన్నుల కూరగాయల వితరణ



టీటీడీ అన్నదాన సత్రానికి కూరగాయలను పంపుతున్న నిర్వాహకులు

పలమనేరు: తిరుమల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కర్ణాటకలోని భాగలూరు కూరగాయల మార్కెట్ నుంచి పది టన్నుల కూరగాయలను స్థానిక శ్రీవారి భక్తులు రవీంద్రారెడ్డి, బాబు సేకరించారు. వీటిని శుక్రవారం టీటీడీ ప్రత్యేక వాహనంలో తిరుమలకు తరలించారు. ఈ వాహనానికి పలమనేరు మార్కెట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కొండకు సాగనంపారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయిలో నగరి విద్యార్థి సత్తా



సాధించిన పతకాలతో తేజేష్

నగరి : బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ఏపీ జట్టు విజయం సాధించి స్వర్ణ పతకం సాధించింది. దీంతో పాటు డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లోను రాష్ట్ర జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో నగరి వశిష్ఠ విద్యాలయకు చెందిన క్రీడాకారులు కేసీ తేజేష్ అన్ని పోటీల్లోను ప్రతిభ కనబరిచాడు. తేజేష్‌కు మంత్రి ఆర్కేరోజా, చిత్తూరు, నగరి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ప్రశంసలు అందించారు.

యువతి అదృశ్యం



వినుత (ఫైల్)

పుంగనూరు: పట్టణంలోని ఏవిరావు వీధిలో నివాసం ఉన్న మధుసూదన్‌శెట్టి కుమార్తె వినుత(23) అదృశ్యమైనట్లుగా పోలీసులు కేసు నమోదు చేశారు. వినుత గురువారం గోరింటాకు తీసుకొస్తానని బజారుకెళ్లి తిరిగి రాలేదని తండ్రి మధుసూదన్‌శెట్టి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ లభిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అమర వీరులకు వందనం

- ప్రాణాలను పణంగా పెడుతున్న పోలీసులు
- నాడు భారత్–టిబెట్ సరిహద్దులో చైనా దుశ్చర్య
- నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం



చిత్తూరు అర్బన్: పోలీసుగా విధులు నిర్వర్తించడమంటే కత్తిమీద సాములాంటిది. ఖాకీ దుస్తులు వేసుకుని ఇంటి నుంచి బయలుదేరే పోలీసన్న కష్టం అంతా ఇంతా కాదు. ప్రజల ధన, మాన, ప్రాణాలతో పాటు సమాజంలో శాంతిభద్రల పర్యవేక్షణకు పడేపాట్లు కళ్లారా చూస్తుంటాం. ప్రతీ ఒక్కరికీ అవసరంలో గుర్తుకొచ్చేది పోలీసులే. అలాంటి పోలీసులు విధి నిర్వహణలో ఒక్కోసారి అసాంఘిక శక్తుల చేతుల్లో ప్రాణాలు కోల్పోతుంటారు. అలాంటివారిని స్మరించుకుంటూ ప్రతీ ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి కూడా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పది రోజుల పాటు అమరులైన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించి, వారి త్యాగాలను గుర్తుచేయడానికి పోలీసు అధికారులు సన్నద్ధమయ్యారు.

నాటి అమరుల గాథ...

1959, అక్టోబర్ 21. భారత్–టిబెట్ సరిహద్దుల్లో ఉన్న లడక్ లోని ఆక్సాయ్‌చిన్ వద్ద భారత్‌కు చెందిన కేంద్ర రిజర్వ్ పోలీసులు (సీఆర్‌పీఎఫ్) సరిహద్దులో రక్షణగా ఉన్నారు. విపరీతమైన చలిలో పది మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వర్తిస్తుండగా, చైనా సైనికులు భారీ సంఖ్యలో మన దేశ సరిహద్దులోకి చొచ్చుకువచ్చారు. వారిని ఈ పదిమంది పోలీసులు ధైర్యంగా ఎదిరించి, చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి, దేశం కోసం అసువులు బాశారు. భారతదేశ రక్షణ కోసం పోలీసులు ప్రాణాలు వదిలిన తొలి సందర్భం అది. ఇందుకుగాను అన్ని రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు 1960 జనవరి 9న సమావేశమై అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలని తీర్మానించారు. అప్పటి నుంచి దీన్ని అమలు చేస్తున్నారు. పోలీసు అమరవీరులకు నివాళులర్పించడానికి చిత్తూరు నగరంలోని ఏఆర్ పోలీసు మైదానంలో ఏర్పాట్లు సిద్ధంచేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక తిరుపతి నగరంలో కూడా పోలీసు ఏఆర్ మైదానంలో పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీసుల ప్రదర్శనలు ఇవ్వడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిని తిలకించడానికి పౌరులు సైతం పాల్గొనచ్చు.

విధి నిర్వహణలో ఎందరో..

ఇటీవల పుంగనూరులో టీడీపీ నేతలు పోలీసులపై చేసిన దాడులను సమాజం విస్తుపోయి చూసింది. ఒకరిద్దరు కాదు.. ఏకంగా 50 మంది పోలీసులపై రాళ్లు, మద్యం బాటిళ్లు, కర్రలతో దాడులు చేశారు. ఒకరిద్దరు పోలీసులను చంపాలని కుట్ర పన్నారు. అయినా మడమతిప్పని జిల్లా పోలీసు యంత్రాంగం ముందుకెళ్లి, ప్రజలకు అడ్డుగా నిలబడింది. ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐ నుంచి కానిస్టేబుల్ వరకు రక్తాన్ని చిందించారు. పచ్చ నేతల కుట్ర దాడిలో రణధీర్ అనే స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ తన కంటి చూపును పోగొట్టుకున్నాడు. ఆయనకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఇక పోలీసుగా విధులు నిర్వర్తిస్తూ అసాంఘిక శక్తుల చేతిల్లో ప్రాణాలు పోగొట్టుకున్నవారు జిల్లాలో ఆరుగురు ఉన్నారు. వీరిలో 1996లో కర్నూల్లో నక్సల్‌కు పోలీసులకు జరిగిన కాల్పుల్లో జిల్లాలోని ములకలచెరువులో పనిచేసిన కానిస్టేబుల్ అశ్వర్థనారాయణ అమరుడయ్యారు. 2007లో అప్పటి చిత్తూరు ఎమ్మెల్యే సీకే బాబుపై జరిగిన రెండు వేర్వేరు దాడుల్లో అంగరక్షకులుగా ఉన్న హుస్సేన్ బాషా, సురేంద్ర వీర మరణం పొందారు. 2017లో పలమనేరు అడవుల్లో మహిళపై అత్యాచార యత్నాన్ని అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ జవహర్‌నాయక్, హోంగార్డు దేవేంద్ర ప్రాణాలు పోగొట్టుకున్నారు. వీరితో పాటు విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారికి సైతం జిల్లా పోలీసు యంత్రాంగం ప్రతీ ఏటా నివాళులర్పిస్తోంది.

యూనిఫామ్ ఓ చాలెంజ్..



పోలీసు శాఖలో ఉద్యోగం చేయడమనేది చాలా మంది యువత పాషన్‌గా పెట్టుకుంటారు. యూనిఫామ్ వేసుకునే అవకాశం కొందరినే వరిస్తుంది. పోలీస్ ఉద్యోగం అనేది చాలెంజ్‌తో కూడుకున్నది. కుటుంబం కన్నా సమాజమే మిన్నగా భావించాలి. ఇలాంటి సమయంలో ప్రాణాలను పోగొట్టుకున్న వాళ్లకు, ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం. ప్రభుత్వం కూడా ఈ విషయంలో పోలీసు వెంటే నిలిచి ధైర్యాన్ని నింపుతోంది. అమరవీరుల దినోత్సవాన అమరులైన పోలీసు కుటుంబ సభ్యుల్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

– వై.రిషాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు

కలెక్టరేట్‌లో పలమనేరు ఆర్డీవో



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్డీవో మనోజ్

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా నియమితులైన పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్ రెడ్డి కలెక్టర్‌ను కలిశారు. బాధ్యతలు స్వీకరించేందుకు జిల్లాకు విచ్చేసిన ఆయన శుక్రవారం కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. తర్వాత జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును కలిశారు.

సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి



ఉద్యోగోన్నతి పొందిన నాన్‌టీచింగ్ ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కందాటి విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 15 మంది సీనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి పొందారని వెల్లడించారు. సుదీర్ఘ కాలంగా ఉద్యోగోన్నతుల కోసం ఎదురు చూస్తున్న జూనియర్ అసిస్టెంట్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకున్నదని చెప్పారు. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని స్పష్టం చేశారు.

27 లోపు దరఖాస్తుల ధ్రువీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : మైనారిటీ విద్యార్థుల ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్, మెరిట్ కం మీన్స్ పథకాల దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ లోపు ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, హెచ్‌ఎంలు ధ్రువీకరించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరానికి ప్రభుత్వం ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్, మెరిట్ కం మీన్స్ పథకాలలో మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తోందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న మైనారిటీ విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. సంబంధిత విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, హెచ్‌ఎంలు తమ లాగిన్‌లలో ఉన్న దరఖాస్తులను గడువులోపు తప్పనిసరిగా ధ్రువీకరించి ఆమోదించాలని తెలిపారు. లేకపోతే స్కాలర్‌షిప్ మంజూరు కాదన్నారు. ఇతర వివరాలకు 7382781316, 7989135360ను సంప్రదించాలని కోరారు.

అనర్హులుంటే తహసీల్దార్‌పై కఠిన చర్యలు తప్పవు

చిత్తూరు కలెక్టరేట్ : అసైన్‌మెంట్ భూ పట్టాల నివేదికల్లో అనర్హులున్నారని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి ఆర్డీవో, తహసీల్దార్, పలు శాఖల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అసైన్‌మెంట్ భూ పట్టాల కసరత్తు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కసరత్తు లో సిద్ధం చేసిన నివేదికల్లో అనర్హులన్నట్లు తేలితే సంబంధిత తహసీల్దార్‌ను కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. మరోసారి నివేదికలు పునఃపరిశీలన చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈనెల 25వ తేదీలోపు జీఈఆర్ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రాజశేఖర్, డీఈవో విజయేంద్ర రావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటర మణారెడ్డి, డీఎల్‌డీవో రవికుమార్, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి నుంచి నగదు అపహరణ

చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయుడి నుంచి నగదు లాక్కొని పారిపోయిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు, చిత్తూరుకు చెందిన భాస్కర్ బంగారుపాళ్యంలోని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ నెల 17న చిత్తూరు గాంధీ రోడ్డుపై వెళుతుండగా వెనుక బైక్‌పై వచ్చిన వ్యక్తి భాస్కర్ వద్ద ఉన్న రూ.49 వేలు నగదు లాక్కొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.



శ్రీశక్తిపీఠంలో రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా



శ్రీశక్తిపీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఆర్కే రోజా

రామచంద్రాపురం: మండలంలోని శ్రీశక్తిపీఠంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం రాష్ట్ర పర్యాటక, క్రీడా, సాంస్కృతిక, యువజన శాఖా మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠ నిర్వాహకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శ్రీకమలాత్మిక దేవి అలంకరణలో ఉన్న శ్రీమరకతశక్తి కాళీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతీల ఆశీస్సులు పొందారు.

సమ్మోహనం



లక్కీడిప్ విజేతకు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న వీసీ నాగరాజ రామారావు

చంద్రగిరి: శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల్లో రెండు రోజులుగా జరుగుతున్న మోహన మంత్ర–2023 కార్యక్రమం అట్టహాసంగా సాగుతోంది. ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి దాదాపు 16 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం నిర్వహించిన పలు సాంకేతిక యాప్‌లకు సంబంధించి విద్యార్థులు నిర్వహించిన వర్క్‌షాపులు వారి మేథోశక్తికి నిదర్శనంగా నిలిచాయి. కళాక్షేత్రంలో విద్యార్థులు నిర్వహించిన నృత్య, గాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా ఫన్ గేమ్స్, లక్కీడ్రా, డీజేహౌస్, హర్రర్ హౌస్, డిజిటల్ ఈవెంట్స్, ఫుడ్ చాలెంజ్, ట్యాలెంట్ ఎగ్జిబిషన్, గల్లీ క్రికెట్, రింగ్ టాస్, ఫ్లాగ్ పాటింగ్, ఎస్కేప్ రూం, బ్రేక్ డ్యాన్స్, కొలంబస్, డ్రాగన్ ట్రిన్, వాటర్ వాక్ వంటి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఒకవైపు సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా టెక్నికల్ విభాగంలో విద్యార్థుల ప్రదర్శనలు మైమరపించాయి. మోహన మంత్ర కార్యక్రమంలో భాగంగా ఎంబీయూ వీసీ ఆచార్య నాగరాజ రామారావు లక్కీడిప్ విజేతలను శుక్రవారం ప్రకటించారు. ప్రథమ బహుమతి పూర్ణచంద్రారెడ్డికి ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతి తోషిత్‌కు ట్యాబ్, తృతీయ బహుమతి వెంకట్‌కు సైకిల్‌ను అందించారు.



అథ్లెటిక్స్‌లో నింద్ర విద్యార్థుల సత్తా

నింద్ర: మండలానికి చెందిన కావునూరు గ్రామానికి చెందిన విద్యార్థులు 34 సబ్ జూనియార్స్ అథ్లెటిక్స్ జాతీయ పోటీల్లో విజేతలుగా నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించారు. ఇంతటి విశేష ప్రతిభ కనబరిచిన సుఖేష్, ఇందిరా ఇద్దరూ కావునూరు ఎంపీటీసీ సభ్యుడు విజేష్ సంతానమే. వీరిని క్రీడల శాఖ మంత్రి ఆర్‌కే రోజా అభినందించారు.

కలుషిత ఆహారంతో ఏడుగురికి అస్వస్థత



బాధితుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న వైద్యసిబ్బంది

గుడిపాల: మండలంలోని చిత్తపార గ్రామంలో కలుషితాహారంతో ఏడుగురు అస్వస్థతకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, చిత్తపారలో కర్మక్రియలకు బంధువులు హాజరయ్యారు. అదేరోజు కలుషిత ఆహారం తిని రాత్రి ఒకే కుటుంబంలోని ఏడుగురు అస్వస్థతకు గురి కావడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇందులో ముగ్గురు శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. మిగతా నలుగురు చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారు. వైద్య సిబ్బంది చిత్తపార గ్రామంలో అస్వస్థతకు గురైన ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ ఎటువంటి ప్రాణహాని లేదని వైద్యులు నిర్ధారించారు.

